## క్లుప్తంగా

### దివ్యాంగ విద్యార్థులకు మెడికల్ క్యాంపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైద్యులు

సంతనూతలపాడు: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యుడు అశోక్ కుమార్ 20 మంది దివ్యాంగ విద్యార్థులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. ఒంగోలు శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ కాలేజ్ ప్రిన్సిపాల్ టి.సుధాకర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం కేవీ సుబ్బారెడ్డి, సమగ్ర శిక్ష సహిత విద్య ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

### నేడు విశ్వబ్రాహ్మణుల వనభోజనాలు

ఒంగోలు మెట్రో: నగరంలోని ఓల్డ్ బైపాస్ రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో నేడు కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పోతకమూరి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. విశ్వబ్రాహ్మణులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల వయోపరిమితి పెంచాలి

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కె.సుజన్‌మాదిగ కోరారు. ఆ మేరకు శనివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ముప్పాళ్ల గ్రామం వచ్చిన చైర్మన్‌ను కలిసి ఎస్సీ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు వివరించారు. రిటైర్ అయిన తర్వాత కేవలం రూ.3 వేలు మాత్రమే పెన్షన్ వస్తోందని, హెల్త్ కార్డు సౌకర్యం కూడా లేదని అన్నారు. చైర్మన్‌ను కలిసి వారిలో త్యాగరాజు, రాజశేఖర్, బాలాజీ తదితరులు ఉన్నారు.

### గ్రానైట్ లారీలు పట్టివేత



పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్ల రవాణా చేస్తున్న లారీలను గనుల శాఖ అధికారులు, రామతీర్థం ప్రాంతంలో మైనింగ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. గ్రానైట్ ముడిరాళ్ల లారీలకు మైనింగ్ అధికారులు కేసులు రాసి ఏపీఎండీసీ ప్రాంగణానికి తరలించారు.

### అనాథ యువతికి పోలీసుల ఆశ్రయం



అనాథ యువతిని హోంకు తరలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: కన్నవాళ్లు కన్నుమూశారు. నా అనే వాళ్లు ఎవరూ లేరు. బతికే దారి లేక నిరాశలో కూరుకుపోయింది ఓ యువతి. ఊరి చివర ఒంటరిగా బాధపడుతున్న ఆమెకు ఒంగోలు తాలూకా పోలీసులు ఆశ్రయం కల్పించారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన పాతికేళ్ల యువతికి తల్లిదండ్రులు లేరు. బంధువులు మొహం చాటేశారు. ఆమె ఏదైనా పని చేసుకుని బతుకుదామని ఒంగోలు వచ్చింది. రెండు రోజులైనా పని దొరకలేదు. దాంతో ఊరిచివర మామిడిపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్దకు చేరుకుంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే దిగాలుగా కూర్చుంది. స్థానికులు గమనించి హెల్ప్ స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ఆమె వివరాలు సేకరించారు. తాలూకా సీఐ అజయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన తాలూకా పోలీసులు హౌసింగ్ బోర్డులోని స్వధార్ హోంకు ఆమెను తరలించి ఆశ్రయం కల్పించారు.

# వర్షం నీరు వదిలేదెలా..?

- బకింగ్ హాం బ్రిడ్జి వద్ద డైవర్షన్ రోడ్డు కారణంగా పొలాలను ముంచేసిన వరద నీరు
- డైవర్షన్ రోడ్డు అడ్డుగా ఉండటంతో బకింగ్ హాం కాలువలో కలవని నీరు
- భారీగా పొలాల్లో నీరు నిలిచి మునిగిన పంటలు
- వరద నీటిలోనే పొలాలకు వెళ్లే రహదారులు
- వ్యవసాయం చేయలేకపోతున్నామంటున్న రైతులు
- బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ డైవర్షన్ రోడ్డును తొలగించని వైనం
- రైతుల పట్ల నిర్లక్ష్యంగా కూటమి పాలకులు, అధికారులు



బకింగ్ హాం బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు




డైవర్షన్ రోడ్డు కారణంగా బకింగ్ హాం కాలువలోకి వెళ్లే మార్గం లేక పొలాల్లో చేరిన వర్షం నీరు

కొత్తపట్నం: ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులో బకింగ్ హాం కాలువపై బ్రిడ్జి నిర్మించడంతో ప్రయాణికుల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా ఈ బ్రిడ్జిని నిర్మించారు. గత ఎన్నికలకు ముందే ఈ బ్రిడ్జిపై రోడ్డు నిర్మాణం కూడా పూర్తిచేసి తుదిమెరుగులు దిద్దారు. ఇంతవరకూ బాగానే ఉన్నప్పటికీ.. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా బ్రిడ్జికి చుట్టుపక్కల ఉన్న పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ ఆ బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డును తొలగించలేదు. దీంతో వర్షం నీరు బకింగ్ హాం కాలువలోకి వెళ్లేందుకు డైవర్షన్ రోడ్డు అడ్డంగా ఉండిపోయింది. ఆ నీరంతా బకింగ్ హాం కాలువలోకి వెళ్లే మార్గం లేక చుట్టుపక్కల ఉన్న పొలాల్లో చేరి పంటలను ముంచెత్తుతోంది. చిన్నపాటి వర్షానికి కూడా పొలాల్లో నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. రైతులు పోసిన నార్లు నీటమునిగి కుళ్లిపోతున్నాయి. పంట సాగుచేసినాగానీ నారు దశలోనే దెబ్బతింటోంది. డైవర్షన్ రోడ్డు నిర్మించే సమయంలో వర్షం నీరు బకింగ్ హాం కాలువలోకి వెళ్లేందుకు అక్కడ చిన్నపాటి తూము మాత్రమే ఏర్పాటు చేశారు. ఒక మోస్తరు వర్షం నీటిని కూడా ఆ తూము లాగలేకపోతోంది. ఇక భారీ వర్షం కురిస్తే పొలాలు, ఆ పొలాలకు వెళ్లే రోడ్లన్నీ మునిగిపోతున్నాయి.

**2015 నుంచి ఇదే సమస్య...**

బకింగ్ హాం కాలువపై బ్రిడ్జి నిర్మాణాన్ని 2015లో ప్రారంభించారు. ఆ సమయంలో డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చుట్టుపక్కల పొలాల రైతులు వరద నీటి సమస్యతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా బ్రిడ్జి నిర్మాణంలో ఉండటంతో ఎవరూ పట్టించుకోలేదు. బ్రిడ్జి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తపట్నం మండలంలోని గమళ్లపాలెం గ్రామ రైతులు సుమారు 400 ఎకరాల్లో, రాజుపాలెం రైతులు 200 ఎకరాల్లో, అల్లూరు రైతులు 400 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. వరి, శనగ, రొయ్యల చెరువులతో పాటు వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఆ ప్రాంతంలోని వర్షం నీరు, మురుగునీరంతా బకింగ్ హాం కాలువ నుంచే ప్రవహించి సముద్రంలో కలవాల్సి ఉంది. కానీ, డైవర్షన్ రోడ్డు కారణంగా అలా జరగకపోవడంతో పొలాలు, పొలాలకు వెళ్లే రహదారుల్లో నిల్వ ఉంటోంది. లింక్ రోడ్లన్నీ కూడా వర్షం నీటితో నిండాయి. ఎరువులు, వరినారు, వివిధ రకాల వ్యవసాయ సామగ్రి తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడం వలన ఎక్కువగా వరద నీరు చేరింది. ప్రస్తుతం వరి నారు నాటుకోవాలంటే పొలాల్లో నిల్వ ఉన్న వర్షం నీటిని బయటకు పంపాలి. బకింగ్ హాం కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ అధికారులు డైవర్షన్ రోడ్డును తొలగించకపోవడంతో వర్షం నీరు వెళ్లే మార్గం లేకుండా పోయిందని, వ్యవసాయం చేయలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి డైవర్షన్ రోడ్డును తొలగించి తమ పొలాలను, పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



గమళ్లపాలెం రైతుల పొలాల్లో మునిగిన వరినారు



రోడ్డు పక్కన భారీగా నిలిచిన వర్షం నీరు

**డైవర్షన్ రోడ్డుతో మా పొలాలన్నీ మునిగిపోయాయి**



2015లో వేసిన డైవర్షన్ రోడ్డును బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా నేటికీ తొలగించలేదు. డైవర్షన్ రోడ్డు మధ్యలో రెండు తూములు వేశారు. ఆ రెండు తూములు వరద నీటిని అసలు లాగడం లేదు. ఈ ఏడాది అధిక వర్షాలు పడటం వలన మా పొలాల్లో నీరు నిల్వ చేరింది. వరి నారు పోస్తే మొత్తం మునిగిపోయింది. నాతో పాటు చాలా మంది రైతులు నార్లు పోసుకుంటే మునిగిపోయాయి. కొన్ని దెబ్బతిని పాచిపోయాయి. అధికారులు స్పందించి బకింగ్ హాం బ్రిడ్జి పక్కన అప్రోచ్ రోడ్డును వెంటనే తొలగించాలి.

– బలగాని వెంకట్రావు, రైతు, గమళ్లపాలెం

**నారు పోసుకుని నష్టపోతున్నాం**



ఫెంగల్ తుఫాన్‌కు కురిసిన భారీ వర్షానికి పొలాల్లో చేరిన నీరు బయటకు వెళ్లక వరినారు నష్టపోతున్నాం. అదును దాటిపోతున్నా ఈ ఏడాది వరి పండించే పరిస్థితి కనిపించడం లేదు. పోసిన నారు మడులు మునిగిపోయాయి. డైవర్షన్ రోడ్డు తొలగిస్తే పొలంలో నీరు తగ్గి నారుమడులు బాగుపడతాయి. అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– బలగాని రామకృష్ణ, రైతు, గమళ్లపాలెం

**రైతుల సమస్య పరిష్కరిస్తాం**

నేను ఇక్కడకు వచ్చి రెండు నెలలే అయింది. రైతుల పొలాలను పరిశీలించి సమస్య తెలుసుకుని పరిష్కరిస్తా. డైవర్షన్ రోడ్డును ఎందుకు తొలగించలేదో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటా. రైతులు నష్టపోకుండా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించి అవసరమైన చర్యలు చేపడతా.

– నాగార్జున, ఆర్అండ్‌బీ ఏఈ

# శాస్త్రోక్తంగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం



ప్రత్యేక అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

- భక్తిశ్రద్ధలతో స్వామివారి షష్టి వేడుకలు

ఒంగోలు మెట్రో: మార్గశిరమాసం శనివారం సుబ్రహ్మణ్యస్వామి షష్టి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో వేడుకలు, కళ్యాణాలను అర్చకులు, వేద పురోహితులు వైభవంగా నిర్వహించారు. స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, రంగారాయుడు చెరువు దగ్గర సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో, మంగమూరుడొంకలోని ఐశ్వర్యనగర్లో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, సీతారాంపురంలోని వరాల నాగేంద్ర స్వామికి, ఒంగోలు కొండమీద స్కందగిరిలో, స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి, గోపాల్‌నగరంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలమున మూలవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం, వివిధ రకాల పూలతో అలంకరణ చేసి అష్టోత్తర శతనామావళి పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి అన్నప్రసాదాలు స్వీకరించారు.



సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ క్రతువులో పాల్గొన్న దంపతులు

**సంతనూతలపాడు మండలంలో...**

సంతనూతలపాడు: స్థానిక నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర షష్టి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా ప్రాతఃకాల సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు బ్రహ్మశ్రీ ఆదిమూలం శ్రీ సాయిశర్మ, కమిటీ సభ్యులు బూదాటి శ్రీనివాసరావు, మోదుకూరి రాజేష్ గుప్తా , సన్నమూరి సుబ్బనాచారి పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు మండలంలో...**

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో శనివారం 20వ వార్షికోత్సవం సందర్భంగా వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం దేవస్థానం చైర్మన్ కుంచాల నాగరాజు పర్యవేక్షణలో వేదపండితులు రఘురామయ్య, రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, వేణుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. తొలుత అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం వితరణ చేశారు. సాయంత్రం విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు గ్రామస్తులంతా సహాయ సహకారాలు అందించారు.



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం చేస్తున్న మహిళలు



సంతనూతలపాడు: ముస్తాబైన నాగేంద్రస్వామి

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎంపీ మాగుంట, మురళీమోహన్

సంతనూతలపాడు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా ఎస్పీ ఏఆర్ దామోదర్, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హాజరయ్యారు. ఏర్పాట్లు సూదనగుంట ఫౌండేషన్ నిర్వాహకులు పర్యవేక్షించారు. సమావేశానికి హైదరాబాద్ డీఎస్పీ అన్ను వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. 71వ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. తొలుత మొదటి కోర్టులో బాలురు ప్రకాశం జట్టు, కర్నూలు జట్టు తలపడ్డాయి. సూదనగుంట కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావు, కె.ప్రసాద్, జి. శ్రీనివాసరావు, వై.పూర్ణచంద్రరావు డి.రమేష్, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కో ఆర్డినేటర్స్ వై.శీనయ్య, టీఎన్టీయూసీ అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు, పీడీలు బి.శేషగిరిరావు, మల్లికారాణి, అమ్మయ్య, ప్రోగ్రాం ఆర్గనైజర్ సూదునగుంట వేణుబాబు, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ జాయింట్ సెక్రటరీ అమరావతి ధనశేఖర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి నగరోత్సవం



అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న శిద్దా రాఘవరావు

చీమకుర్తి: హరిహరక్షేత్రంలో అయ్యప్పస్వామి నగరోత్సవం శనివారం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుదీర్ దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో హరిహరక్షేత్రంలో అయ్యప్పస్వామి విశేష పూజలు నిర్వహించారు. నగరేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సర్వదీక్షా స్వాములు ఆధ్వర్యంలో నిర్వహించిన పడిభజనలో భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబు బాదుడుతో ప్రజలపై భారం




సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ

ఒంగోలు టౌన్: విద్యుత్ చార్జీలు పెంచబోనంటూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చి సీఎం అయిన చంద్రబాబు వేలాది కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలపై పెనుభారం పడుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలపై నగరంలోని మల్లయ్య లింగం భవనంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ఏ మాత్రం బాధ్యత ఉన్నా చంద్రబాబు ఒట్టి మాటలు చెప్పడం మానుకుని సెకీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చెప్పారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఐ నిర్వహించే పోరాటాలలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తున్నాయని, ప్రజల కోసం కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలను సైతం తుంగలో తొక్కిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు వినియోగించుకున్న విద్యుత్ తాలూకా చార్జీల కంటే కూడా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా విధిస్తున్న ట్రూ అప్ చార్జీలే ఎక్కువగా ఉన్నాయని సీపీఎం నగర నాయకుడు జి.రమేష్ విమర్శించారు. విద్యుత్ బిల్లులు పేద ప్రజలకు భారంగా మారకూడదని సీపీఐ ఎంఎల్ నాయకురాలు లలిత కుమారి అన్నారు. వామపక్షాలు చేపట్టే విద్యుత్ వ్యతిరేక ఉద్యమంలో తాము కూడా కలిసి వస్తామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా తెలిపారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబుకు ఇప్పుడు ఉన్నట్లుండి వాటిపై ప్రేమ పుట్టుకొచ్చిందని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి ఎద్దేవా చేశారు. ఒకవైపు స్మార్ట్ మీటర్లు బిగించేదిలేదని చెబుతూనే.. మరోవైపు బిగిస్తున్నారని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లపై దొంగనాటకాలు ఆపాలని హితవు పలికారు. సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు ఎం.విజయ, ఆర్.లక్ష్మి, శ్రీరాం శ్రీనివాస్, ఎంఏ సాలార్, మోహన్, కోటేశ్వరరావు, పెండ్యాల హనుమంతరావు, నల్లూరి మురళి, గద్దల బాలకోటయ్య, ప్రభాకర్, లెనిన్, ఎం.అంజయ్య, దాసరి సుందరం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి జేసీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో వివిధ రంగాల్లో విజయం సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులని సత్కరించారు. ఎన్సీసీ పరేడ్ అట్టహాసంగా జరిగింది. ఇన్‌చార్జి హెచ్ఎం నారాయణరావు అధ్యక్షత వహించారు. విద్యా కమిటీ చైర్మన్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు...**

సంతనూతలపాడు హైస్కూల్లో ముగ్గులు, డ్యాన్సు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల చెరువు నాగ ధనలక్ష్మి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరు పాఠశాలలో మెగా పేరెంట్స్ డే సమావేశానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. సర్పంచ్ రమణమ్మ, సుబ్బు రత్తయ్య పాల్గొన్నారు.

**కూనంనేనివారిపాలెంలో..**

గ్రామంలోని పాఠశాల ఆవరణలో మెగా పేరెంట్స్ డే సమావేశానికి ఎంపీడీవో రాఘవేంద్ర, ఎస్ఐ జోసఫ్ కుమార్, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పదమటినాయుడుపాలెంలో..**

సర్పంచ్ బొంత కరుణప్రియ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పి.రమేష్, పాలపర్తి ప్రకాష్, మాజీ సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, తొరటి రోశయ్య, హెచ్ఎం సంపూర్ణ పాల్గొన్నారు

నాగులుప్పలపాడు: అమ్మనబ్రోలు జెడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాలలో స్థానిక శాసన సభ్యుడు బీఎన్ విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మద్దిపాడు: మండలంలోని గుండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. ఎమ్మెల్యే విజయకుమార్, అధికారులు పాల్గొని మాట్లాడారు.

**ఉన్నత విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు**

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరై మాట్లాడారు.

**ఒంగోలులోని గద్దలగుంటలో...**

ఒంగోలు టౌన్: స్థానిక గద్దలగుంటలోని శ్రీ పింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. హెచ్ఎం పద్మావతి పాల్గొని మాట్లాడారు. కరవది పీఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్లో ఎంపీడీఓ శేషు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.